క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి ఇన్‌స్పైర్ అవార్డు



కోవూరు: పడుగుపాడు నేతాజీనగర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జీ కోదండ రామయ్యకు ఇన్‌స్పైర్ అవార్డు లభించింది. బుధవారం నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కోదండ రామయ్యను డీఈఓ గంగాభవాని, ఏపీసీ ఉషారాణి సత్కరించి అవార్డును ప్రదానం చేశారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు, జగదేవిపేట పీహెచ్‌సీల పరిధిలోని అంగన్‌వాడీ చిన్నారులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో 93 మంది చిన్నారులకు పరీక్షలు చేశారు. పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారంపై తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారులు విజయ్‌శంకర్, సుచిత్ర, సీడీపీఓ హేనాసుజన్, ఏసీడీపీఓ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వంపై సమీక్ష



బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో గడప గడపకు మన ప్రభుత్వంపై చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలోని 9,10 వార్డుల్లో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నారని తెలిపారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తారని చెప్పారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అందుబాటులో ఉండాలన్నారు. కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



బుచ్చిరెడ్డిపాళెం : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని బుచ్చిరెడ్డిపాళెం ఎంఈఓ-2 పాతపాటి వెంకటరత్నం పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన దొడ్ల కోదండరామిరెడ్డి మేనల్లుడు తిరుపతికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయ్యప్ప చరణ్‌రెడ్డి 150 మంది విద్యార్థులకు విద్యాసామగ్రిని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చింతం రెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా రిసోర్స్‌పర్సన్ గండికోట సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు మున్వర్, వేణు, బ్రహ్మారెడ్డి, నిర్మల, విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పార్లపల్లిలో పశువైద్యశిబిరం



పొదలకూరు : మండలంలోని పార్లపల్లిలో పశు విజ్ఞాన బడిలో భాగంగా బుధవారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. దూడలు, గొర్రెలకు నట్టల నివారణ మందు పంపిణీని పొదలకూరు ఏడీ కే అరుణ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాడి రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ కే అరుణ, తోడేరు డాక్టర్ ఎస్ శిరీష, బిరదవోలు వీఏఎల్‌ఓ వై మల్లికార్జున, ఏహెచ్‌ఏలు అజయ్, రేష్మ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి



ఇందుకూరుపేట: కొత్తూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో యోగాసనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వెంకటాచలం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని విక్రమ సింహపురి వర్సిటీ వైస్‌చాన్సలర్ జీఎం సుందరవల్లి పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరులోని విక్రమ సింహపురి వర్సిటీలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యోగా గురువు నరేష్‌కుమార్ వీఎస్‌యూ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా వీసీ జీఎం సుందరవల్లి మాట్లాడారు. యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. యోగా విశిష్టతను గుర్తించి ప్రస్తుతం ప్రపంచం మొత్తం దైనందిన జీవితంలో ఒక భాగంగా అలవాటు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతిరోజూ యోగా సాధనను ప్రతిఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. ప్రాచీన ఆయుర్వేదాన్ని ప్రతిఒక్కరూ అచరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పీ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ జీ విజయానంద్‌కుమార్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

- ఎర్రగుంట వద్ద ఉన్న సీఆర్సీలో యోగా గురువు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యోగాసనాలు సాధన చేశారు. యోగాతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్సీ డైరెక్టర్ రాజీమణిపాల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కొడవలూరు: ఆరోగ్యకర జీవనానికి యోగా ఎంతో అవసరమని గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జీ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గండవరం ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడారు. చిన్న వయస్సు నుంచే యోగా సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలిపారు. ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిణి ఎస్ గీత మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి ఆయుర్వేదం, యోగాకు ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. యోగా శిక్షకులు జ్యోతిరాజేంద్రకుమార్, హిమబిందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో యోగాసనాలు, సూర్యనమస్కారాలు చేయించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ యోగా సాధనతో విద్యార్థులు యోగా,సూర్యనమస్కారాలు చేశారు. ఆ ఆసనాలు అందరిని ఆకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమంలో పీడీ కే అరోరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణపట్నం పోర్టులో..

ముత్తుకూరు: యోగాతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆదాని కృష్ణపట్నం పోర్టు సీఈఓ జీజే రావు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోర్టులో ఉద్యోగులు, కార్మికులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమానికి సీఈఓ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని సూచించారు. ఒత్తిడి లేని జీవనానికి యోగా ఎంతో సహకరిస్తుందన్నారు. సీఓఓ సంజయ్, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ వేణుగోపాల్, హెచ్‌ఆర్ డీజీఎం శ్రీనివాస్, రాజేష్‌రంజన్, మనోహర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని డీపీఓ సుస్మితారెడ్డి పేర్కొన్నారు. కోవూరు పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో డీపీఓ పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీహరి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొదలకూరు: యోగా సాధనతో శారీరక రుగ్మతలు దూరమవుతాయని పొదలకూరు సీఐ జీ సంగమేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక శ్రీనిర్మలానంద నిత్య యోగా సాధనా కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యోగా సాధనతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం సీఐను యోగా గురువు పెంచలయ్య, సాధకులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. యోగా అభ్యాసకులు, సాధకులు లక్కాకుల ఆనందరావు, బీ పెంచలరెడ్డి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు: సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు యోగాసనాలను ప్రదర్శించారు. అనంతరం గ్రామంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారం నిర్మించి యోగా విశిష్టతను వివరించారు. హెచ్‌ఎం షేక్ అహ్మద్‌బాషా, ఉపాధ్యాయులు విద్యుల్లత, కృష్ణవేణి, శశాంక్, రహీం, తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం: ఎర్రగుంటలోని సీఆర్సీలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



వెంకటాచలం: వీఎస్‌యూలో..



కొడవలూరు: గండవరం హైస్కూల్‌లో..



కృష్ణపట్నం పోర్టులో..



కోవూరులో యోగాసనాలు వేస్తున్న డీపీఓ



పొదలకూరులో సీఐకు సత్కారం



టీపీగూడూరు: సౌత్‌ఆములూరులో..

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి



కోవూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీహరి అన్నారు. మండలంలోని పడుగుపాడు సచివాలయం-1 ఆవరణలో గృహసారథులు, వలంటీర్లకు జగనన్న సురక్షపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్షలో భాగంగా ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని సూచించారు. జెడ్పీటీసీ శ్రీలత, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, సర్పంచ్ లక్ష్మీనారాయణ, సచివాలయ కన్వీనర్ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

బుచ్చిరెడ్డిపాళెం : కోవూరు నియోజకవర్గంలో 11వ విడత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నుంచి నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి ఇంటింటిని సందర్శించి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించనున్నట్లు చెప్పారు. స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరించనున్నట్లు తెలిపారు. జూన్ 22న బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 9వ వార్డు, జూలై 7న పదో వార్డు, 8న 11వ వార్డు, 17న 12వ వార్డు, జూలై 18న 13వ వార్డు, జూలై 21న పంచేడు గ్రామంలో పర్యటించనున్నట్లు చెప్పారు. విడవలూరులో జూన్ 23, 24, 26 తేదీల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. ఇందుకూరుపేట మండలంలో జూన్ 27న కొత్తూరు చింతోపు, 29,30 ఇందుకూరుపేట, జూలై 12న కొమరిక, 19న రావూరు, 20న పున్నూరు గ్రామాల్లో పర్యటించనున్నట్లు వివరించారు. కొడవలూరు మండలంలో జూన్ 28న యల్లాయపాళెం, జూలై 10,11న కొత్తవంగల్లు,22న పాతవంగల్లు,27,28న కమ్మపాళెం గ్రామంలో పర్యటించనున్నట్లు చెప్పారు. జూలై 13, 14,15,24, 25, 26 తేదీల్లో కోవూరులో నిర్వహించనున్నట్లు వివరించారు.

కలెక్టర్ చొరవతో జనన ధ్రువీకరణలు సులభతరం



జనన ధ్రువీకరణలు పొందిన చిన్నారుల తల్లిదండ్రులతో అధికారులు



బుచ్చిరెడ్డిపాళెంలో..

కొడవలూరు: కలెక్టర్ చొరవతో చిన్నారులకు జనన ధ్రువీకరణలు సులభతరమయ్యాయని జెడ్పీ సీఈఓ బీ చిరంజీవి పేర్కొన్నారు. మండలంలోని 80 మంది చిన్నారులకు ఐసీడీఎస్ అధికారులు ఆస్పత్రుల ద్వారా మంజూరు చేయించిన జనన ధ్రువీకరణలను బుధవారం ఆయన పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఈఓ మాట్లాడుతూ చిన్నారులకు జనన ధ్రువీకరణలు లేకపోవడంతో ఆధార్ పొందలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ సమస్యపై కలెక్టర్ ప్రత్యేక చొరవ కనబరిచి ఐసీడీఎస్, వైద్య, సచివాలయ సిబ్బంది ద్వారా సులభంగా జనన సర్టిఫికెట్లు పొందే వెసులుబాటు కల్పించారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టి అనేక మంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం అభినందనీయమని కొనియాడారు. కావలి డీఎల్‌డీఓ కనకదుర్గా భవాని మాట్లాడుతూ కలెక్టర్ ప్రయోగాత్మకంగా చేపట్టిన జనన ధ్రువీకరణల ప్రత్యేక డ్రైవ్ సత్ఫలితాలు ఇస్తోందన్నారు. జనన ధ్రువీకరణలు లేని చిన్నారుల తల్లిదండ్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం, సీడీపీఓ పీ జ్యోతి, ఏసీడీపీఓ ఎన్ అరుణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు టీ నాగభూషణమ్మ, వీ పద్మావతి, స్వర్ణ, నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు జనన ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్నట్లు డీఎల్‌డీఓ వసుమతి తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయంలో చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 78 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో జనన ధ్రువీకరణ పత్రాలు లేని 104 మంది చిన్నారులను గుర్తించి అందజేసినట్లు తెలిపారు. నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ శ్యామ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఉమాశంకుంతలమ్మ పాల్గొన్నారు.

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మనుబోలు: భవిత కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఐఆర్పీఎస్‌లు శ్యామల, షర్మిల కోరారు. మనుబోలు భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిత కేంద్రానికి రాలేక ఇళ్ల వద్దే ఉండి తమ సలహాలు, సూచనలతో చదువుకునే దివ్యాంగ విద్యార్థులకు నెలకు రూ.300 అందజేస్తున్నామని తెలిపారు. భవిత కేంద్రానికి వచ్చే విద్యార్థులకు రవాణా చార్జీల కోసం నెలకు రూ.300, యూనిఫామ్, బూట్లు అందజేస్తున్నామని చెప్పారు. బాలికలకు అదనంగా నెలకు రూ.2500 స్టైఫండ్ అందజేస్తున్నామని తెలిపారు. ఫిజియోథెరపి, స్పీచ్‌థెరపి సేవలను అందిస్తున్నామని వివరించారు.



విద్యాకానుకలను అందజేస్తున్న ఐఆర్‌పీఎస్‌లు

దూసుకొచ్చిన మృత్యువు

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్
- బాలిక మృతి, తల్లికి తీవ్ర గాయాలు
- పూడి క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదం

పుత్తూరు రూరల్(తిరుపతి జిల్లా): షాపింగ్‌కు బయలుదేరిన తల్లీకుమార్తె ఆనందం అంతలోనే ఆవిరైంది. కుమార్తెను ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబళించగా, తల్లి తీవ్రంగా గాయపడింది. వడమాలపేట- పూడి క్రాస్ రోడ్డు వద్ద బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన విషాదాన్ని నింపింది. ఆస్పత్రి వద్ద బంధువులు, గ్రామస్తుల ఆర్తనాదాలు మిన్నంటాయి. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాల పంచాయతీ అమ్మవారితోపు గ్రామానికి చెందిన గౌతమ్ తిరుపతిలో పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. భార్య ప్రశాంతి, కుమార్తె యమున(14), కుమారుడు మోక్షిరుషి(8)తో కలసి బ్రాహ్మణపట్టులో నివాసం ఉంటున్నాడు. పత్తిపుత్తూరు హైస్కూల్‌లో యమున(అమ్ము) 9వ తరగతి, మోక్షిరుషి 3వ తరగతి చదువుతున్నారు. బుధవారం సాయంత్రం 'అమ్మా! స్కూల్ నుంచి వచ్చేశా... అంటూ ఆప్యాయంగా పలకరించింది యమున. 'సరే అమ్మూ! 'పేటకు వెళ్లి సిలిండర్ తేవాలి, షాపింగ్ చేయాలి రెడీ అవ్వు' అంటూ తల్లి చెప్పింది. రెడీ అయిన తల్లీ కుమార్తె వడమాలపేట మండలం బ్రాహ్మణపట్టు నుంచి సిలిండర్‌తో స్కూటర్‌పై బయలుదేరారు. వడమాలపేట-పూడి క్రాస్ వద్దకు రాగానే ఎదురుగా మామిడి కాయల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో కిందపడిన యమున తలపై ట్రాక్టర్ చక్రం ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రశాంతి తీవ్రంగా గాయపడగా తిరుపతి రుయాకు తరలించారు. యమున మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వడమాలపేట ఎస్‌ఐ రామాంజనేయులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



యమున అలియాస్ అమ్ము (ఫైల్)

నేడు మంత్రి కాకాణి పర్యటన

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం పర్యటించనున్నట్లు వైఎస్‌ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి బుధవారం తెలిపారు. సర్వేపల్లిలో క్రిబ్‌కో భూముల్లో ఏర్పాటు చేయనున్న రెండు బయోఎనర్జీ ప్లాంట్లకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 10.30 గంటలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. ఈ సందర్భంగా సర్వేపల్లిలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో మంత్రి కాకాణి పలువురు ప్రముఖులతో కలిసి పాల్గొననున్నట్లు తెలిపారు.

పొదలకూరు : మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం పొదలకూరులో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి బుధవారం తెలిపారు. పట్టణంలోని ద్వారకామయి కల్యాణ మండపంలో సాయంత్రం 4 గంటలకు నిర్వహించే పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

మూగ జీవాలను చంపితే జైలుకే

పొదలకూరు : మూగ జీవాలను ఎవరైనా క్రూరంగా చంపితే జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టం ప్రకారం జైలుకు పంపడం జరుగుతుందని తోడేరు పశువైద్యాధికారి ఎస్ శిరీష హెచ్చరించారు. మంగళవారం 'సాక్షి'లో 'వేటగాళ్ల తూటాలకు గోవుల బలి' శీర్షికన ప్రచురితమైన వార్తపై డాక్టర్ శిరీష స్పందించి బుధవారం వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1960లో పార్లమెంట్‌లో రూపొందించిన జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టం ప్రకారం మూగజీవాలను చంపితే నిందితులకు జైలుతో పాటు జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

మడమనూరు హెచ్‌ఎంకు ఎంఈఓగా పదోన్నతి

మనుబోలు: మండలంలోని మడమనూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీసీ మస్తానయ్యకు ఎంఈఓగా పదోన్నతి లభించింది. చేజర్ల రెండో ఎంఈఓగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మడమనూరు హెచ్‌ఎంగా శివశంకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత



బుచ్చిరెడ్డిపాళెం: ఇస్కపాళెం పంచాయతీ పోలినాయుడు చెరువుకు చెందిన షేక్ నాగూర్ ఇటీవల మృతి చెందగా వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు చెక్కు మంజూరైంది. ఆయన భార్య ఇమామ్‌బీకి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కోడూరు మధుసూదన్‌రెడ్డి సచివాలయ సిబ్బందితో కలిసి బుధవారం చెక్కు అందజేశారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

తోటపల్లిగూడూరు: భూసార పరీక్షలకు అనుగుణంగా వరి పంటకు ఎరువులను వాడుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు పేర్కొన్నారు. ఇస్కపాళెం రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయశాఖ సిబ్బందికి మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులను వాడుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గించుకోవచ్చని తెలిపారు. ఆమ్ల, క్షార భూములను గుర్తించవచ్చన్నారు. అనంతరం పంట పొలాల్లో మట్టి నమూనాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నర్సోజీరావు, ఏఓ శిరీషారాణి, వీఏఏలు పాల్గొన్నారు.



మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

ఎంఈఓకు సన్మానం

వెంకటాచలం: మండల రెండో ఎంఈఓ శ్రీనివాసులు రెడ్డిని ఏపీటీఎఫ్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. మండల విద్యావనరుల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చేవూరు సుబ్బారావు, మండలాధ్యక్షుడు నరసింహయ్య, ప్రధానకార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, మాల కొండయ్య, రమణరాజు, కిరణ్‌కుమార్, ఇందిర, లక్ష్మి, విజయమ్మ, శైలజావాణి, తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు సేవలపై అవగాహన కలిగి ఉండాలి



పొదలకూరు: విజేతలుగా నిలిచిన విద్యార్థినులు



ముత్తుకూరు: ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

మనుబోలు: విద్యార్థులు బ్యాంకు సేవలపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ శేషాద్రివాసు అన్నారు. విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించేందుకు ఆర్‌బీఐ ఆదేశాల మేరకు స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి ఆల్ ఇండియా క్విజ్ పోటీలను బుధవారం నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.5 వేలు,రూ.4 వేలు, రూ.3 వేలు చొప్పున నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏపీజీబీ మేనేజర్ నిఖిల్, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీకాంతారావు, వసంతకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు : ఆల్ ఇండియా క్విజ్ పోటీల్లో భాగంగా స్థానిక డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో విద్యార్థినులకు మండల స్థాయి పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ జీహెచ్‌ఎస్‌కు చెందిన కే స్నేహిత(10వ తరగతి), ఎం సాయి దేవిక (9వ తరగతి), అమ్మవారిపాళెం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఎస్ పల్లవి(10వ తరగతి), వీ కుసుమ(9వ తరగతి), తాటిపర్తి వైకేకే జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఆర్ లక్ష్మీసాధ్విక(10వ తరగతి), పీవీ తన్విక(9వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు

ముత్తుకూరు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో ఆల్ ఇండియా క్విజ్ పోటీలను బుధవారం నిర్వహించారు. మండలంలోని ఆరు జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన ఇద్దరు చొప్పున విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎంఈఓలు మధుసూదన్, హేమసుందరరావు, యూనియన్ బ్యాంకు మేనేజర్ సుబ్బారావు, గురుకుల కళాశాల ప్రిన్సిపల్ సుజాత పర్యవేక్షణలో పరీక్షలు జరిగాయి. ఇన్విజిలేటర్లుగా జీవీబీ మురళీకృష్ణ, జే జనార్దన్ వ్యవహరించారు. ఈ పోటీల్లో గురుకుల కళాశాల ప్రథమ, బ్రహ్మదేవి జెడ్పీహెచ్‌ఎస్ ద్వితీయ, ఎంవీ పాళెం జెడ్పీహెచ్‌ఎస్ తృతీయ బహుమతులు పొందాయి.

కొడవలూరు: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆల్ ఇండియా క్విజ్ పోటీలను బుధవారం నిర్వహించారు. మండలంలోని ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, రెండు ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన ఎంపిక చేసిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. గండవరం హైస్కూల్‌కు చెందిన కే.జస్వంత్, డీ.యోగేష్ ప్రథమ, యల్లాయపాళెం హైస్కూల్‌కు చెందిన ఎం లాస్యమాధురి, ఎస్కే సాహుల్ ద్వితీయ, రెడ్డిపాలెం హైస్కూల్‌కు చెందిన టీ లాస్య, పీ అమూల్య తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. విజేతలకు ఎంఈఓ-1 జీ వసంతకుమారి బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈఓ-2 ఎన్ అంకయ్య, ఏపీజీబీ నార్తురాజుపాళెం బ్రాంచ్ మేనేజర్ జే పాల్‌రాజ్, సీఆర్పీలు జే.పెంచలరావు, ఎం దయాకర్ పాల్గొన్నారు.



కొడవలూరు: విజేతలతో విద్యాశాఖ అధికారులు



మనుబోలులో..